RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 241 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 5 మార్చి 2024 పేజీలు : 4 వెల : 2/-

# అభివృద్ధిలో రేవంత్‌కు పూర్తి సహకారం




## రూ.6 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ

ఆదిలాబాద్: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దేశాభివృద్ధికి కృషి చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో రూ.7వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రామగుండం ఎన్టీపీసీలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేశారు. దీంతో పాటు రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించారు. "దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయింది. ఈ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుంది. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తుంది. గత పదేళ్లలో పేదరికం నుంచి 25 కోట్ల మంది బయటపడ్డారు" అని మోదీ అన్నారు.

**మోదీ గ్యారెంటీయే నిజమైన గ్యారెంటీ :** బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రెండూ ఒకటేనని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దోచుకోవడం, అబద్ధాలు చెప్పడం జూట్, లూట్ రెండే కుటుంబ పార్టీలకు తెలుసని ఆయన మండిపడ్డారు. సోమవారం ఆదిలాబాద్‌లో జరిగిన బీజేపీ విజయసంకల్ప సభలో మోదీ ప్రసంగించారు. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అని తొలుత మోదీ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా షెడ్యూలే రాలేదని, ఇది ఎన్నికల సభ కాదని అభివృద్ధి సభ అని చెప్పారు. సభలో మోదీ మాట్లాడుతూ 'తెలంగాణలో టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారిన తర్వాత ఎలాంటి మార్పు రాలేదు. బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏమీ మార్పు రాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ కుంభకోణం చేస్తే ఆ స్కామ్ ఫైళ్లను కాంగ్రెస్ తొక్కి పట్టింది. మీరు తిన్నారు. మేమూ తింటాం అని కాంగ్రెస్ అంటోంది. మోదీ గ్యారెంటీపై ప్రస్తుతం దేశంలో చర్చ జరుగుతోంది. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ. వేల కోట్ల అభివృద్ధి పనులకు ఇవాళ శంకుస్థాపన చేసుకున్నాం. దేశంలో అభివృద్ధి ఉత్సవం జరుగుతోంది. తెలంగాణప్రజల మధ్య ఈ ఉత్సవం జరుపుకోవడానికి నేను ఇక్కడికి వచ్చా. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి ఉత్సవం చేస్తోంది. ఈ పదిహేను రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో రెండు ఐఐటీలు, 3 ఐఐఎంలు, ఒక్క ఐఐఎస్, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. ఇప్పుడు చెప్పండి ఇది అభివృద్ధి ఉత్సవం అవునా కాదా.. ఎన్నికలు వచ్చినపుడు ఎన్నికల గురించి చూసుకుందాం. నిన్న మంత్రి వర్గం, అధికారులు అందరం కలిసి రోజంతా వికసిత్ భారత్ గురించి చర్చించాం. వికసిత్ భారత్‌పై 15 లక్షల మంది ప్రజలు తమ సూచనలు చేశారు. ఇప్పటికి 3 వేల సమావేశాలు పెట్టాం. 11 లక్షల మంది వికసిత్ భారత్‌లో భాగస్వాములయ్యారు. తెలంగాణలోని గ్రామగ్రామంలో యువకులు, మహిళలు, రైతులు, కార్మికులు అందరూ కలిసి అబ్ కీ బార్.. చార్ సౌ పార్ అని నినదిస్తున్నారు. అబ్ కీ బార్ నాలుగు వందలపైన.. బీజేపీకి ఓటు వెయ్యాలి. రాంజీగోండు, కొమురం భీములు పుట్టిన భూమి ఇది. వాళ్లు స్వాతంత్రం కోసం పోరాడారు. బీజేపీ రాకపోతే ఆదివాసి మహిళ దేశానికి రాష్ట్రపతి అయ్యేదా. భగవాన్ బిర్సాముండా పుట్టినరోజును అధికారికంగా జరుపుకునే వాళ్లమా. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ట్రైబల్ మ్యూజియమ్‌కు రాంజీ గోండు పేరు పెడుతున్నాం. కుటుంబ పార్టీలకు ఇది సహించదు. మేం జాతి కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా వారు అడ్డుపడుతున్నారు. బీజేపీ ఆదివాసిల కోసం పనిచేస్తోంది. ఆదివాసీల కోసం బీజేపీ పీఎంజన్‌మన్‌యోజన ప్రారంభించింది. తెలంగాణలో సమ్మక్కసారక్క ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. మోదీకి గ్యారెంటీపై దేశంలో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తి అయ్యే గ్యారెంటీ. తెలంగాణ రైతుల కోసం పసుపు బోర్డు ఇచ్చాం. పసుపు రైతులకు అన్ని రకాల మద్దతు ఇస్తాం. తెలంగాణకు ఒక మెగాటెక్స్‌టైల్ పార్కు ఇచ్చాం. నా జీవితం తెరిచిన పుస్తకం. నేను చిన్నప్పుడు ఒక కలతో ఇళ్లు విడిచిపెట్టా. దేశప్రజల కోసం జీవించాలని ఇళ్లు విడిచిపెట్టా. మీ కలల కోసమే నా సంకల్పం. నాకు ప్రత్యేక కలలు ఏమీ లేవు. ఇందుకే దేశంలోని కోట్ల మంది నన్ను వారి కుటుంబ సభ్యుడు అని అనుకుంటారు. 140 కోట్ల మంది నా కుటుంబ సభ్యులే. నా దేశం నా కుటుంబం అన్న భావనతో మీ కోసం నేను జీవిస్తున్నా. అందుకే దేశం ఈరోజు నాది మోదీ కుటుంబమే(మై హూ మోదీకా పరివార్) అని చెబుతోంది. అయోధ్య రామ మందిరంలో బంగారు దర్వాజ, మందిరంలోని బంగారు ధ్వజ స్తంభం నిర్మాణంలో తెలంగాణ పాత్ర ఉంది. రామ్‌లల్లా ఆశీర్వాదం తెలంగాణ ప్రజలపై ఉంటుంది. వికసిత్ తెలంగాణ లక్ష్యాన్ని మేం తప్పకుండా పూర్తిచేస్తాం. రానున్న 25 ఏళ్లలో కష్టపడి దేశాన్ని ప్రపంచంలోనే అగ్ర దేశాల్లో ఒకటిగా తయారు చేయాలి. మీ ఆశీర్వాదం నాకు కావాలి. మీ ప్రేమ కావాలి' అని మోదీ తన ప్రసంగాన్నిముగించారు.




## 4 ఎంపీ స్థానాలకు భారాస అభ్యర్థులు ఖరారు

హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను భారాస అధినేత కేసీఆర్ ప్రకటించారు.

కరీంనగర్ నుంచి వినోద్‌కుమార్, పెద్దపల్లి - కొప్పుల ఈశ్వర్, ఖమ్మం - నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోత్ కవిత పేర్లను ఖరారు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రెండు రోజులుగా ఆయా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ చర్చించారు. సమష్టి నిర్ణయం ప్రకారం ఏకగ్రీవంగా ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను వెల్లడించారు.

## 6, 7 తేదీల్లో.. ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పోరుబాట..

హైదరాబాద్: ఎల్ఆర్ఎస్‌పై(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాటకు దిగింది. మార్చి 6న అన్ని నియోజకవర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చింది. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కలిసి వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. తాము తెచ్చిన పథకాలకు ఆనాడు అడ్డు చెప్పి ఇప్పుడు అవే పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు నాలుక మడతేశారని విమర్శించారు. తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆనాడు కోర్టులో కేసు వేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారని.. ఉచితంగా భూములు క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారన్నారు. దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్క కూడా అన్నారని తెలిపారు. ప్రజల నుంచి 20వేల కోట్లు భారం ప్రజలపై వేయడానికి ఎత్తుగడ వేశారని మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్‌పై వేసిన పిల్ ఏమైంది కోమటిరెడ్డి అని ప్రశ్నించారు. భట్టి, సీతక్క కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు. మార్చి31లోపు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ఉన్న కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎల్ఆర్ఎస్‌కు నిరసనగా 6న అన్ని నియోజక వర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎంసడీ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవో లను కలిసి వినతి పత్రాలు ఇస్తామని, పార్టీ పక్షాన న్యాయ పోరాటం కూడా చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. కాగా.. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి మార్చి 31లోగా క్రమబద్ధీకరణ ప్రక్రియను ముగించాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.




# రాష్ట్రాభివృద్ధి కోసం... కేంద్రంతో దోస్తీ




## ఆదిలాబాద్ ప్రధాని మోడీ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

### ఆదిలాబాద్ ప్రధాని మోడీ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఆటంకమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ తమిళిసై, సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంతో కలిసి ముందుకెళ్తామన్నారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్నారు. ఎన్టీపీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. కంటోన్మెంట్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసినందుకు ప్రధానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి పెద్దన్నలా మోదీ సహకారం అందించాలని కోరారు.

**రేవంత్ ఎలా ఉన్నావు.. మోడీ పలకరింపు..! :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చారు. మోదీ మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి ఆదిలాబాద్ చేరుకున్నారు. ప్రధానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని జాతికి అంకితం చేశారు. పలు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత సభలో పాల్గొన్నారు. సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కూడి పక్కన గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ఎడవ వైపున సీఎం రేవంత్ రెడ్డి కూర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోడీ రేవంత్ రెడ్డితో ఏం మాట్లాడి ఉంటారని చర్చ కొనసాగుతోంది. ఇద్దరు స్టార్ హీరోలపై ఎంపీ సుమలత సంచలన వ్యాఖ్యలు, పిలిస్తే ఢిల్లీ వెలుతా, అయితే ఈసారి! గత ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రధాన నరేంద్ర మోడీని కలిసేందుకు సీఎం ఇష్టపడలేదు. కానీ రేవంత్ రెడ్డి ప్రొటోకాలు పాటిస్తూ.. రాష్ట్ర ప్రజయోజనాల కోసం పని చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. కేంద్రంతో మంచిగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన నిధులు సాధిస్తామని చెబుతున్నారు. కాగా మోడీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మోడీ సభ అనంతరం మధ్యాహ్నం తమిళనాడుకు వెళ్లనున్నారు. తిరిగి రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్నారు. ప్రధాని సోమవారం రాత్రి రాజ్‌భవన్‌లో బస చేయనున్నారు. మంగళవారు సంగారెడ్డిలో ప్రధాని మోడీ పర్యటిస్తారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తెలంగాణ పర్యటన తర్వాత ఒడిశాకు వెళ్తారు. ఈ రెండు రోజుల్లో తెలంగాణలో మొత్తం 15,718 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో ఆయన పర్యటించనున్న ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ మొత్తంలో పోలీసు బలగాలు మోహరించాయి.

అధికారిక కార్యక్రమాలకు, పార్టీ కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి ప్రధాని మోడీ వస్తుండటంతో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు రేవంత్ సర్కారు సిద్ధమైంది. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రానికి సహకరిస్తామని మంత్రి సీతక్క తెలిపారు

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## వారిని దేశ వ్యతిరేకులుగా ప్రకటించండి
## నెటిజన్ల డిమాండ్!

వరల్డ్ టూరులో భాగంగా మనదేశాన్ని సందర్శించడానికి వచ్చిన స్పెయిన్ కు చెందిన మహిళపై గ్యాంగ్ రేప్ జరిగిన సంగతి తెలిసిందే. భర్తతో కలిసి స్కూటర్ పై మనదేశంలో జార?ండ్ లో పర్యటిస్తున్న క్రమంలో ఆ మహిళ సామూహిక అత్యాచారానికి గురయింది. ఇప్పటికే నిందితుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాధిత మహిళ ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో కోలుకుంటోంది. ఈ నేపథ్యంలో నెటిజన్లు ఈ ఘటనపై దుమ్మెత్తిపోశారు. సంస్కృతి, సంప్రదాయాలకు భారత్ పుట్టినిల్లు అని, మనదేశంలో మహిళలను దేవతల్లా కొలుస్తారని.. అలాంటి దేశంలో ఇలాంటి అత్యాచారాలు జరగడం దారుణమని మండిపడ్డారు. చెడ్డ వ్యక్తుల వల్ల దేశం మొత్తానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఇలాంటి ఘటనల వల్ల ప్రపంచ దేశాల్లో భారత్ తల ఎత్తుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివి చేయడానికి మరొకరు భయపడేలా కఠిన శిక్షలు ఉండాలని కోరుతున్నారు. ఈ అత్యాచార ఘటనపై న్యాయస్థానం వెంటనే ప్రత్యేక విచారణ జరపాలని నెటిజన్లు కోరుతున్నారు. ప్రత్యేక కేసుగా పరిగణించి విచారణ జరపాలని సూచిస్తున్నారు. నిందితులకు జీవిత కాల శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా వారిని దేశ వ్యతిరేకులుగా ప్రకటించాలని కోరుతున్నారు. ఇలాంటి నేరస్తుల వల్ల అంతర్జాతీయ వేదికలపై భారత్ పరువు పోతోందని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ గ్యాంగ్ రేప్ వివరాల్లోకి వెళ్తే.. జార?ండ్ లో ఈ దారుణం చోటు చేసుకుంది. జార?ండ్ లోని దుమ్కా జిల్లాలో తన భర్తతో కలిసి బైక్ పై టూరుకు వచ్చిన స్పెయిన్ పర్యాటకురాలిపై గ్యాంగ్ రేప్ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్పెయిన్ కు దంపతులు బైక్ పై మనదేశానికి వచ్చారు. ముందుగా బంగ్లాదేశ్ చేరుకున్నారు. అక్కడి నుంచి జార?ండ్ లోని దుమ్కాకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి బిహార్ మీదుగా నేపాల్ కు వెళ్లాలని అనుకున్నారు. ఈ క్రమంలో జార?ండ్ లోని దుమ్కాకు చేరుకున్నారు. చీకటి పడడంతో నిర్జన ప్రదేశంలో రాత్రి బస కోసం దంపతులు డేరా ఏర్పాటు చేసుకున్నారు. వీరిని ఒంటరిగా గమనించిన 10 మంది దుండగులు భర్తపై దాడికి దిగారు. అతడిని గాయపరిచారు. ఆ తర్వాత స్పెయిన్ వివాహితపై ఒకరి తర్వాత ఒకరు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశారు. బాధితురాలికి ప్రస్తుతం దుమ్కాలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితులను ప్రశ్నిస్తున్నట్లు దుమ్కా ఎస్పీ వెల్లడించారు. టూరిస్టు వీసా మీద స్పెయిన్ దంపతులు భారత్ వచ్చినట్టు తెలిపారు. స్పానిష్ జంట మోటార్ బైక్ పై దుమ్కాలో పర్యటిస్తూ పలు ప్రదేశాలు సందర్శిస్తున్నారన్నారు. దుమ్కా సమీపంలోని కుంజి గ్రామంలో టెంట్లు వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు దుండగులు బాధితురాలిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారని చెప్పారు. మొత్తం ఆసియా ఖండంలో టూర్ కు ప్లాన్ చేసిన స్పానిష్ జంట తొలుత పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో తమ టూర్ పూర్తిచేసుకున్నారు. తర్వాత జార?ండ్ వచ్చారు. ఇక్కడి నుంచి నేపాల్ వెళ్లాలనేది వారి టూర్ ప్లాన్. ఇంతలోనే ఈ దారుణం చోటు చేసుకుంది.

# మరమ్మతులు కరవు



కామారెడ్డి : లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. పదికాలాల పాటు మన్నాల్సిన ప్రగతి పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. జిల్లా కేంద్రంలో 49 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో ఎనిమిదేళ్లలో పాతిక కోట్ల విలువైన రోడ్డు పనులు చేపట్టారు. ఇందులో అనేక ప్రాంతాల్లో పైపులైన్లు లేని చోట రోడ్లు నిర్మించారు. ఆ తర్వాత కుళాయిల పైపులైన్ల కోసం ఎక్కడికక్కడ ఇష్టారాజ్యంగా సీసీ రోడ్లు ధ్వంసం చేసి గోదావరి జలాల తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు అంతర్గత కాలనీల్లో కుళాయిల కోసం తవ్విన రోడ్లు ప్రమాదకరంగా మారాయి.

ఆదాయానికి గండి..

జిల్లా కేంద్రంలో సీసీ రోడ్లు తవ్వాలంటే పురపాలక అనుమతి తప్పనిసరి. కుళాయి కనెక్షన్ పొందేవారి నుంచి తవ్వకం రుసుం వసూలు చేయాలి. అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పనులు సాగుతున్నాయి. ఎవరికివారు రోడ్ల ధ్వంసానికి పాల్పడుతున్నారు. బల్దియాకు రుసుముల పేరిట ఆదాయం రావాల్సి ఉన్నా గండి కొడుతున్నారు.

తొలగని ఇబ్బందులు..అంతర్గత వార్డుల్లో అధ్వానంగా మారిన సీసీ రోడ్లకు మరమ్మతులు చేపట్టడానికి నిధుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పనులే తప్పా కొత్తవి చేపట్టడం లేదు. పట్టణంలో ఆయా శాఖల మధ్య సమన్వయం లోపించింది. నిధులకు సంబంధి ంచిన వ్యవహారం కావడంతో వార్డు సభ్యులు జోక్యం చేసుకుంటున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే..

పట్టణంలోని వార్డుల్లో ఎన్ని రోడ్లు ధ్వంసమయ్యాయో లెక్క తీయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నివేదిక సిద్ధం చేయాలని పేర్కొంటున్నారు. పైపులైన్ల కోసం తవ్విన చోట మరమ్మతులు చేయాల్సి ఉందని నీటి సరఫరా విభాగ బాధ్యుడు శ్యాం వెల్లడించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవిస్తామన్నారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండు వెనకాల ఆర్‌కే లాడ్జి పక్క వీధిలో కుళాయి పైపులైన్లు వేయడానికి రోడ్డు మధ్యలో ఇష్టారాజ్యం గా తవ్వారు. ఈ రోడ్డు రూ.3 లక్షలతో నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. రోడ్డు తవ్వకం రుసుం వసూలు చేయకుండానే చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# సెనగ, కందుల ధరలకు రెక్కలొచ్చాయ్..!



జుక్కల్ : రబీలో ఆరు తడి పంటలు సాగు చేయడంలో జుక్కల్ రైతులు ముందంజలో ఉన్నారు. ముఖ్యంగా సెనగ, కంది పంటలు రైతుల ముఖంలో చిరునవ్వును చిందిస్తున్నాయి. ఒక్కో ఏడాది ఒక్కో తీరు. దిగుబడి వస్తే ధర ఉండేది కాదు.. ధర ఉంటే దిగుబడి వచ్చేది కాదు. కానీ ఈ సారి రెండూ కలిసొచ్చాయనే చెప్పుకోవచ్చు. కొంత మంది రైతులు దిగుబడి తగ్గి కాసింత దిగులు చెందినా.. ధర కలిసి రావడం వరంగా భావిస్తున్నారు. ఆ ధర ఏదో జుక్కల్‌లోనే ఉందంటే అదీ లేదు. పంట దిగుబడికి మంచి ధర దక్కాలంటే పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని ఆయా ప్రధాన పట్టణాలకు వెళ్లాల్సిందే. పట్టు వదలకుండా అక్కడెన్ని సమస్యలు ఎదురైనా.. మహారాష్ట్రకు వెళ్లి దిగుబడిని అమ్ముకొంటున్నారు జుక్కల్ రైతులు.

తెరవని కొనుగోలు కేంద్రాలు

పక్క రాష్ట్రానికి పప్పు దినుసులుజుక్కల్ ప్రాంతంలో సాగు చేసే పంటలకు మహారాష్ట్రలో ధర ఉన్నా.. ఒక్క సోయా పంట మాత్రం నష్టాన్ని మిగిల్చింది. మద్దతు ధర కంటే తక్కువగా బహిరంగ మార్కెట్‌లో కొంటున్నారు. సెనగ, కంది కొనుగోలు కేంద్రాలు తెరవనే లేదు. సోయా తెరిస్తే రైతులకు మేలు జరిగేది.

క్వింటా రూ. 10,300

ఎన్నడూ లేని విధంగా ఈసారి కంది రికార్డు ధర పలికింది. క్వింటాకు రూ.10,300 పలుకుతోంది. ఇక్కడ కొనుగోలు చేసే దళారులు, వ్యాపారులు రూ.వెయ్యి తగ్గించినా.. మహారాష్ట్రకు వెళితే ఆ ధర చేజిక్కించుకోవచ్చని ధైర్యం చేస్తున్నారు. ముఖ్యంగా ఉద్గీర్, లాతూర్, దెగ్లూర్, ముద్‌ఖేడ్ ప్రాంతాలకు వెళ్లి కందులు విక్రయించుకొంటున్నారు. పంట చేతికందగానే ధర అత్యధికంగా ఉండటంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా పక్క రాష్ట్రానికి పరుగులు తీస్తున్నారు. కంది మద్దతు ధర రూ. 6,425 ఉన్నట్లు తెలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లోనే కంది ధరకు రెక్కలొచ్చాయి.

కొనేది వారే..ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సెనగ మద్దతు ధర క్వింటా రూ. 5,440 ఉంది. మహారాష్ట్రలోని ఉద్గీర్‌లో క్వింటా ధర రూ.6,000 నుంచి రూ.6,200 పలుకుతోంది. రోజుల తరబడి నిద్రాహారాలుమాని, కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాసే సెనగ రైతులకు ఊరట లభించింది. తూకం కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. రాత్రిళ్లు కేంద్రాల్లో గడపాల్సిన చింత లేదు. చేల నుంచి తెచ్చిన సెనగలను నేరుగా వాహనాల్లో ఎక్కిస్తే.. అదే రోజు చేతుల్లో సొమ్ము పట్టుకొని రైతు సంతోషంగా వస్తున్నారు. మహారాష్ట్రలోని ఉద్గీర్ పట్టణంలో సెనగ అమ్ముకొంటున్నారు. అక్కడా కొనేది దళారులు, వ్యాపారులే. అయినా ఒక్క రోజుల్లోనే సెనగ అమ్మి, నగదుతో ఇంటికి వస్తున్నారు. అదీ ధర ఎక్కువగా ఉండటంతో మురిసిపోతున్నారు. ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

# అంతర్జాలం.. అందనంత దూరం!




పెద్దశంకరంపేట: గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు నేరుగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టీఫైబర్‌ను ప్రవేశపెట్టింది. పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పూర్తికావడం లేదు. పంచాయతీల్లో బిగించిన పరికరాలకు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గ్రామీణులకు ప్రజలకు అంతర్జాల సేవలు అందించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టగా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు.జిల్లాలో 469 పంచాయతీలు ఉండగా, మూడు నాలుగు పంచాయతీలను ఒక క్లస్టరుగా చేసి పాత పంచాయతీల ప్రకారం 110 క్లస్టర్ల పరిధిలో కంప్యూటర్లను పంచాయతీలకు కేటాయించారు. అందులో చాలా వరకు ప్రైవేటుగా అంతర్జాల(ఇంటర్నెట్) కనెక్షన్ ఇచ్చారు. చాలా గ్రామాల్లో సరిగ్గా అంతర్జాలం రాకపోవడంతో ఎంపీడీవో కార్యాలయాలకు తరలించగా కొన్ని పంచాయతీల్లోనే దుమ్ముపట్టిపోయాయి.. చాలా చోట్ల కంప్యూటర్లు ఎంపీడీవో కార్యాలయాల్లో ఉంచి అక్కడి నుంచే ఆపరేటర్లు పనిచేస్తున్నారు. దీంతో గ్రామాల ప్రజలు ఎవైనా ధ్రువపత్రాల కోసం గ్రామాల నుంచి ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. టీ-ఫైబర్ సేవలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చినా చాలా పంచాయతీలకు సొంత భవనాలు లేవు. ఆవాస గ్రామాలు కలిపి మొత్తం 149 పంచాయతీలు కొత్తగా ఏర్పాటయ్యాయి. వీటికి భవనాలు లేక వృథా పాఠశాలలు, సామాజిక భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటి వాటికి వీటిని ఏర్పాటు చేయడం కష్టంగా మారుతోంది. గ్రామాలకు పైపులైన్లు వేయడం కష్టంగా మారుతోంది. ఇటీవల గ్రామాల్లో సీసీ రహదారుల వేసినా, మళ్లీ వాటిని పగుల కొడుతూ పైపులైన్లు వేస్తున్నారు. దీంతో కొత్త రహదారులు ధ్వంసం అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రెండేళ్ల కిందట చేపట్టిన ఈ పనులు ఇంకా పూర్తికావడంలేదు. ఇప్పటికైనా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి చేసేలా చర్యలు: రాజు, టీఫైబర్ డీఈ

టీఫైబర్ పనుల ద్వారా 469 పంచాయతీలకు అంతర్జాల కనెక్షన్ ఇవ్వనున్నాం. పనులు ప్రస్తుతం చివరి దశలో కొనసాగుతున్నాయి. వీటిని త్వరలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

అందుబాటులోకి రాక...ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ధ్రువపత్రాల మంజూరు, పన్నుల వసూలు, వ్యయాలు, కార్మికుల జీతభత్యాలు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. టీ-ఫైబర్ ఏర్పాటు కాకపోవడంతో పల్లె ప్రజలకు డిజిటల్ సేవలు అందడం లేదు. జిల్లాలో అన్ని పంచాయతీలను టీ-ఫైబర్‌తో అనుసంధానించాల్సి ఉంది. గత కొన్ని నెలలుగా క్షేత్రస్థాయిలో వాటిని సంబంధించిన పరికరాలు బిగించారు. విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ భవనాలపై సౌరఫలకాలు ఏర్పాటు చేశారు.

# వైద్య విద్యకు అడుగులు

మెదక్: మెతుకుసీమ సిగలో మరో కలికితురాయి చేరనుంది. ఉన్నత విద్యా సౌకర్యం లేని జిల్లాలో... ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు వైపు అడుగులు పడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కళాశాల మంజూరు కాగా, ప్రిన్సిపల్ నియామకంతో పాటు, నిర్వహణకు తగిన సౌకర్యాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ధారించింది. త్వరలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బృందం జిల్లాకు రానుంది. ఆలోగా కళాశాల నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది.

240 పడకలు తప్పనిసరి...

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు కావాల్సిన సదుపాయాలు ఉన్నాయా?లేవా? అనేది పరిశీలించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. వైద్యవిద్య రాష్ట్ర సంచాలకురాలు డా.వాణి, మెదక్ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.రవీందర్, గాంధీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రుల జిల్లా సమన్వయకర్త(డీసీహెచ్)లు సభ్యులుగా ఉన్నారు. వీరు ఇప్పటికే మెదక్‌లో పర్యటించి వసతులపై ఆరా తీశారు. ప్రధానంగా కళాశాల ఏర్పాటు కావాలంటే అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో 240 పడకలు ఉండాలి. మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 120, మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో 120 పడకలున్నాయి. మరో వైపు ఎంసీహెచ్ పక్కనే 50 పడకలతో క్రిటికల్ కేర్ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో మార్గం సుగమం అయినట్లే. కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంకా టెండర్లు ఖరారు కాలేదు. తాత్కాలికంగా పిల్లికొట్టాల్‌లో పాత సమీకృత కలెక్టరేట్ కార్యాలయం కొనసాగిన భవనాన్ని ఎంపిక చేశారు.ఏర్పాట్లు చేస్తున్నాం: డా.రవీందర్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్యకళాశాల, మెదక్



వైద్యకళాశాల, మెదక్

వైద్య కళాశాల ఏర్పాటుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం పాత కలెక్టరేట్ భవనాన్ని ఎంపిక చేశాం. కళాశాల ఏర్పాటుకు అవసరమయ్యే పడకలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మాతా,శిశుసంరక్షణ కేంద్రంలో ఉన్నాయి. సౌకర్యాలను అద్దె భవనంలో కల్పించనున్నాం. ఆ తర్వాత కేంద్ర కమిటీ వచ్చి పరిశీలించి, ఆమోద ముద్ర వేస్తే వచ్చే విద్యాసంవత్సరంలో కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయి.

రూ.180 కోట్లు మంజూరు

జిల్లాలో ఇంజినీరింగ్, ఇతర వృత్తి కోర్సుల కళాశాలలు లేవు. ప్రైవేట్‌వే ఉన్నాయి. ప్రభుత్వ పరమైనవి లేకపోవడంతో జిల్లాలో ఉన్న విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. ఈ మేరకు పక్కా భవన నిర్మాణానికి గతేడాది సెప్టెంబరులో రూ.180 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకోసం జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల్‌లో 14 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

అన్నీ సమకూరితే..

ప్రభుత్వ వైద్యకళాశాల పక్కా భవనానికి నిధులు మంజూరైనా, ప్రారంభమై...పనులు పూర్తయ్యేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ మేరకు పాత కలెక్టరేట్‌లో కళాశాల నిర్వహణకు కావాల్సిన సదుపాయాలపై దృష్టి సారించారు. ఇందుకోసం రూ.2 కోట్లు అవసరమని కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అన్ని వసతులు సమకూరితే కేంద్ర వైద్య, విద్య కమిటీ వచ్చి పరిశీలించనుంది. ఆ తర్వాత ఆమోదముద్ర వేస్తే 2024-25 విద్యాసంవత్సరానికి తరగతులు ప్రారంభం కానున్నాయి. వంద సీట్ల సామర్థ్యంతో కళాశాల మంజూరు కాగా, అనుమతులు రాగానే మొదట బ్యాచ్‌లో 50 మంది విద్యార్థులతో కళాశాలను నిర్వహించనున్నారు.

# చేతి వృత్తిదారులకు చేయూత

సిద్దిపేట: యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్న ప్రస్తుత తరుణంలో చేతివృత్తులు గత వైభవాన్ని కోల్పోతున్నాయి. సరైన ప్రోత్సాహం లేక క్రమంగా వృత్తిదారుల సంఖ్య తగ్గుతోంది. కళానైపుణ్యం కొరవడుతోంది. ఈ క్రమంలో వృత్తిదారులకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు పలు రకాల యంత్ర పరికరాలు(టూల్ కిట్లు) పంపిణీ చేయడం, తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబరు 17న ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించారు. తద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. మొత్తం 18 కులవృత్తుల వారికి అవకాశం కల్పించనున్నారు. 2027-28 సంవత్సరం వరకు పథకం అమలులో ఉండనుంది. జిల్లాలో దాదాపు 250 సీఎస్‌సీ కేంద్రాలు ఉండగా.. ఇప్పటికే 3 వేల దరఖాస్తులు అందాయి.

ఉచితంగా నమోదు.. జిల్లాలో పెద్దసంఖ్యలో కులవృత్తుల వారు జీవిస్తున్నారు. ఒకప్పటితో పోల్చితే ఉపాధి కరవై అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు విశ్వకర్మ పథకం ఉపకరించనుంది. అర్హత మేర సంప్రదాయ చేతివృత్తిదారులు, కళాకారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. కమ్మరి, వడ్రంగి, స్వర్ణకారులు, కంసాలి, కుమ్మరి, నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, మోచి, రజకులు, దర్జీలు, మేదరి, ఎరుకలి, ఉప్పరి పని, బొమ్మల తయారీ, పూల దండలు, తాళంచెవి తయారీదారులకు పథకం వర్తించనుంది. దరఖాస్తుదారుకు సంబంధించిన ఆధార్, బ్యాంకు ఖాతా, చరవాణి నంబరు, కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలతో సీఎస్‌సీ కేంద్రాల్లో పీఎం విశ్వకర్మ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. అందుకు ఎలాంటి రుసుము లేదు. ఆయా వివరాలను పంచాయతీ, మున్సిపల్ అధికారులు ధ్రువీకరిస్తారు. తుదిగా జిల్లా అమలు కమిటీ ఆమోద ముద్ర వేయనుంది. డిసెంబరులోనే జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. గతంలో ప్రభుత్వం తరఫున ఎలాంటి రుణం పొందని వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

భృతి.. పరికరాలు.. రుణం..పథకంలో భాగంగా ఎంపికైన వారికి శిక్షణను వివిధ దశల్లో అందిస్తారు. తొలుత అభ్యర్థుల నైపుణ్యాలను అంచనా వేసి ప్రాథమిక స్థాయిలో ఐదు రోజుల నుంచి వారం పాటు శిక్షణ అందిస్తారు. తదుపరి మరింత నైపుణ్యం పెంపొందించేలా 15 రోజుల పాటు అధునాతన తర్ఫీదు ఉంటుంది. శిక్షణ కాలానికి సంబంధించి చేతివృత్తిదారులు, కళాకారులకు రోజుకు రూ.500 చొప్పున భృతి, అధ్యయన సామగ్రి, గుర్తింపు కార్డుతో పాటు ధ్రువీకరణ పత్రం అందిస్తారు.

# నిరీక్షణకు తెర.. తీరనున్న కల

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళల నిరీక్షణ ఫలించ నుంది. వడ్డీలేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తామనే ప్రకటన ఊరటనిస్తోంది. మూడేళ్లుగా పేరుకుపోయిన బకాయిల సొమ్ము త్వరలో మహిళల ఖాతాలో జమ కానున్నాయి. వడ్డీ వ్యాపారుల బెడద నుంచి రక్షించి, మహిళలకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం 'వడ్డీ లేని రుణం (వీఎల్ఆర్)' ప్రవేశ పెట్టింది. బ్యాంకు నుంచి పొందిన రుణాలను వాయిదా పద్ధతిలో తిరిగి చెల్లించిన మహిళా సంఘాలకు ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. నాలుగేళ్ల వడ్డీ రావాల్సి ఉండగా గత ఏడాది మార్చిలో మహిళా దినోత్సవం సందర్భంగా ఒక ఏడాది సొమ్ము జమ చేశారు. మిగిలిన మూడేళ్ల బకాయిలు జమ చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక శాఖకు ఆదేశించడంతో మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అతివలకు ఆర్థిక చేయూత

మహిళలు పొదుపు కొలమానంగా సంఘటితమవుతున్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకుని కిరాణం, కంగన్‌హాల్, పిండి గిర్ని, హొటళ్లు, కుట్టు శిక్షణ కేంద్రాలు, బ్యూటీషియన్లు, ఆహార ఉత్పత్తులు ఇలా పలు రంగాల్లో ఆర్థికంగా రాణిస్తున్నారు. బ్యాంక్ రుణాల కిస్తీలు తిరిగి చెల్లించడంలో ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్న అతివలకు మరింత



ప్రోత్సాహకం అందించేందుకు 2012 జనవరి 1న వడ్డీలేని రుణాల పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి మహిళలు అసలు, వడ్డీ కలిపి ముందుగా చెల్లిస్తే తర్వాత సంఘాల ఖాతాల్లో నేరుగా జమ అవుతున్నాయి. ఏడాదికోసారి వడ్డీ బకాయిలు చెల్లించాల్సి ఉండగా జాప్యం చేస్తున్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మహిళలు అప్పులు తీసుకొచ్చి వాయిదాలు చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా.. ఉమ్మడి జిల్లాలో 49,430 స్వశక్తి సంఘాల్లో 5,51,845 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఏటా పొదుపు ఆధారంగా ఒక్కో సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణ కిస్తీల చెల్లింపులో మహిళలకు బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. స్వశక్తి సంఘాల మహిళలు ఉపాధిహామీ, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కిస్తీల చెల్లింపులో ముందుంటున్నారు. ప్రతి నెల సమావేశాల్లో పొదుపు, రుణాల చెల్లింపు, ఇతర అంశాలపై చర్చిస్తుండటంతో మహిళలల్లో క్రమశిక్షణ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మూడేళ్లకు సంబంధించి రూ.292.83 కోట్లు జమ కానున్నాయి. ఇందులో జగిత్యాల జిల్లాలో 92.22 కోట్లు, కరీంనగర్‌లో 65.40 కోట్లు, పెద్దపల్లిలో 65.52 కోట్లు, రాజన్న సిరిసిల్లలో 69.68 కోట్లు ఉన్నాయి. వడ్డీ లేని రుణాలను చెల్లించాలని ఆర్థిక శాఖ సిద్ధం చేస్తుండటంతో మహిళల ఆర్థిక కష్టాలు తొలగనున్నాయి.

# తాగునీరు ఇవ్వాలా.. ఆగాలా..!

హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ నుంచి తాగునీటి విడుదలపై అధికారులు, ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నారు. ఉన్న నీటిలో ప్రస్తుత తాగునీటి అవసరాలకు నీరు విడుదల చేసేందుకు అధికారులు కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సాగర్ నీటి మట్టం 516.7 అడుగులు ఉంది. ఉన్న నీరులో ఏమాత్రం సాగునీటి అవసరాలు తీర్చే పరిస్థితి లేదని అధికారులు, ప్రభుత్వం తేల్చి చెప్పేసింది. కానీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ముందస్తుగానే మంచినీటి అవసరాలకు తాగునీటిని విడుదల చేయాల్సి రావడం ప్రభుత్వానికి, అధికారులకు పెద్ద పరీక్షలా తయారైంది. దీంతో ఎక్కడి నుంచి నీటిని వాడుకోవచ్చునో ప్రభుత్వం అన్వేషణ ప్రారంభించింది.

వాడుకోని 10 టీఎంసీల మాటేమిటి?

తెలంగాణ గత సంవత్సరం 10 టీఎంసీల నీటిని వాడుకోలేదు. ఆ నీటిని ముందస్తు మంచినీటి అవసరాలకు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీకి లేఖలు రాసింది. దీనికి అనుమతి లభిస్తే ముందస్తుగా తాగునీటిని విడుదల చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. కానీ ప్రాజెక్టులో కనీస నీటిమట్టానికి నీరు ఉండటం వల్ల పది టీఎంసీ నీటి విషయంపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో నారాయణపూర్ నుంచి జూరాలకు 3 టీఎంసీల నీరు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వానికి లేఖలు రాస్తోంది. అదే విధంగా కనీస నీటిమట్టానికి 510 అడుగుల నుంచి 505 అడుగుల వరకు నీటిని తీసుకునేందుకు అనుమతించాలని కేఆర్ఎంబీకి కూడా లేఖ రాశారు. ఈ ప్రయత్నాలు ఏవీ కూడా వెంటనే ఫలితాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో సాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉన్న ప్రాంతాలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

కరవు పరిస్థితులు గుర్తించాలి..తెలంగాణలో 2001 నాటి కరవు పరిస్థితులే నెమ్మదిగా నెలకొంటున్నాయి. ఫిబ్రవరి నెలాఖరుకే ఉమ్మడి జిల్లాలో బోర్లు, చెరువులు దాదాపు ఎండిపోయాయి. రక్షిత మంచినీటి పథకాలు కూడా ఎండిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేస్తున్నారు. మార్చి మొదటి వారం వరకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ముందుగా తాగునీటి అవసరాలకు నీరు విడుదల చేస్తేనే ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపిన సమయంలోనూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

ప్రస్తుత పరిస్థితి ఇలా..నాగార్జునసాగర్ ప్రస్తుత నీటి మట్టం 516.7 అడుగులు. 510 అడుగుల వరకు వాడుకుంటే మనకు 10 టీఎంసీల నీరు లభిస్తుంది. 505 అడుగుల వరకు వాడుకుంటే మరో 8 టీఎంసీల నీరు లభిస్తుంది. కనీస నీటిమట్టం తరువాత నీరు వాడుకోవాలంటే కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అనుమతి తీసుకోవాలి. కేఆర్ఎంబీ తాగునీటి అవసరాలకు మాత్రమే అనుమతి ఇస్తుంది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ తాగునీటి అవసరాలకు ఇప్పుడే వదిలితే మే నెలలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. కేఆర్ఎంబీ ఏప్రిల్‌లో తాగునీటి అవసరాలకు నీరు విడుదల చేసేందుకు అనుమతించే అవకాశం ఉంది. అదనంగా వాడుకునేందుకు తెలంగాణకు గత అక్టోబరులో కేటాయించిన 35 టీఎంసీల నీటిని పూర్తిగా వాడుకున్నారన్న విషయం ఏపీ తెరమీదకు తీసుకువస్తుంది. ఈ పరిస్థితుల్లో వెంటనే తాగునీటికి కొంత నీరయినా విడుదల చేయడం ఎలా సాధ్యం అన్న విషయంపై కసరత్తు చేస్తున్నారు.

# బూడిద చెరువుగా మేడిపల్లి ఓసీపీ క్వారీ



గోదావరిఖని : ఎన్టీపీసీ బూడిద చెరువు కోసం సింగరేణి మేడిపల్లి ఓసీపీ క్వారీని కేటాయించే అవకాశం ఉంది. పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ అటవీ, వాతావరణ శాఖ ఉన్నతాధికారుల బృందం ఇటీవల మేడిపల్లి ఓసీపీ క్వారీని సందర్శించింది. ఇటు సింగరేణి, అటు ఎన్టీపీసీ అధికారులు కేంద్ర పర్యావరణ అటవీ శాఖ బృందంతో కలిసి చర్చించారు. పర్యావరణ అనుమతులు రాగానే సింగరేణి మేడిపల్లి ఓసీపీ క్వారీని అప్పగించేందుకు సిద్ధమయ్యారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి పూర్తి కాగానే మేడిపల్లి ఓసీపీలో రెండేళ్ల క్రితం పనులు నిలిపివేసింది. బొగ్గు కోసం తీసిన క్వారీలో తిరిగి మట్టి నింపాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్టీపీసీలో కొత్తగా నిర్మించిన తెలంగా ణ ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద నిల్వ కోసం మేడిపల్లి ఓసీపీ క్వారీని తీసుకునేందుకు చాలాకాలంగా ఇరు సంస్థలు చర్చించుకుంటున్నాయి. మేడిపల్లి ఓసీపీ మూసివేసిన సమయంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో వాతావరణం దెబ్బతినకుండా ఏ విధంగా చర్యలు తీసుకుందన్న విషయాలను కేంద్ర బృందం గతంలో స్వయంగా పరిశీలించింది. తాజాగా మరోసారి సందర్శించి బూడిద చెరువుకు కేటాయించడం ద్వారా నెలకొనే పరిణామాలపై తీసుకోవాల్సిన చర్యలను కేంద్ర పర్యావరణ అటవీ శాఖ బృందం పరిశీలించింది. ఇరు సంస్థలు పర్యావరణ పరిరక్షణకు తీసుకునే చర్యలపై కేంద్ర బృందానికి హామీ ఇవ్వడం ద్వారా మేడిపల్లి ఓసీపీ క్వారీని బూడిద నిల్వ కేంద్రానికి కేటాయించే అవకాశం ఉంది.

పర్యావరణ అనుమతులే ఆలస్యం

మేడిపల్లి ఓసీపీ క్వారీని బూడిద చెరువు కోసం కేటాయించేందుకు పర్యావరణ అనుమతులు రావాల్సి ఉంది. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు 1600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నిర్మాణం పూర్తయింది. మొదటి యూనిట్‌లో విద్యుత్తు ఉత్పత్తి చేపడుతుండగా రెండో యూనిట్ ట్రయల్ రన్ విజయవంతమైంది. త్వరలోనే వాణిజ్య ఉత్పత్తిలోకి తీసుకోనున్నారు. రెండు యూనిట్లకు ఏటా ఏడు మిలియన్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. దీనిని మండించడం ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తును అత్యధిక శాతం తెలంగాణకు సరఫరా చేయనుంది. రోజుకు 20 వేల టన్నుల బొగ్గును మండించే అవకాశం ఉంది. దీని ద్వారా వెలువడే బూడిదను నిల్వ చేసేందుకు ప్రత్యేక కేంద్రం అవసరం. తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణ సమయం నుంచి మేడిపల్లి ఓసీపీని నిల్వ కేంద్రంగా నిర్ణయించుకుని రెండు సంస్థల ఉన్నతాధికారులు అవగాహనకు వచ్చారు. రోజుకు వేల టన్నుల బూడిద వెలువడే అవకాశం ఉండటంతో దానిని మేడిపల్లి ఓసీపీ క్వారీలో నింపడం ద్వారా ఇటు ఎన్టీపీసీకి, అటు సింగరేణికి ఇబ్బంది లేకుండా ఉంటుందని భావించారు. పర్యావరణ శాఖ నుంచి అనుమతులు రాగానే మేడిపల్లి ఓసీపీ క్వారీని ఎన్టీపీసీకి అప్పగించే అవకాశం ఉంది.

పైపులైన్ కోసం సర్వే

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు నుంచి మేడిపల్లి ఓసీపీ వరకు బూడిదను తరలించేందుకు పైపులైను నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీని కోసం ఎన్టీపీసీ సంస్థ సర్వే పనులు పూర్తి చేసింది. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు నుంచి పర్మినెంట్ టౌన్‌షిప్, పోలీసు హెడ్ క్వార్టర్, సీఐఎస్ఎఫ్ కేంద్రం నుంచి మల్కాపూర్ గ్రామం మీదుగా మేడిపల్లి ఓసీపీ వరకు పైపులైన్ నిర్మించనున్నారు. పర్యావరణ అనుమతులు రాగానే ఆయా పనులు వేగంగా పూర్తి చేసే అవకాశం ఉంది.

# రైల్వేస్టేషన్ ప్రాంతం.. కబ్జాల పర్వం




రామగుండం : రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైల్వే ఆస్తులకు రక్షణ కరవైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రామగుండం భూగర్భ వంతెన నుంచి కుందనపల్లి అక్బర్‌నగర్ వరకు ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఏర్పాటు చేసిన రైల్వే ప్రహరీ చూద్దామన్నా కనిపించదు. కిలోమీటరున్నర దూరం వరకు ప్రహరీ పక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. చిన్న టేలాతో మొదలైన ఆక్రమణలు ఏకంగా పక్కా ఇళ్ల నిర్మాణాలకు చేరుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమణల కారణంగా రైల్వేస్టేషన్‌లోకి ప్రయాణికులు, కాలనీ క్వార్టర్లలోకి రైల్వే ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబసభ్యులు రాకపోకలు చేపట్టేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక వాహనదారులైతే ఇరుకు మార్గంలో దారిని వెతుక్కోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం పాత ప్రహరీ తొలగించి పునర్నిర్మిస్తున్నారు. ప్రహరీకి ఆనుకొని ఉన్న అక్రమ కట్టడాలు తొలగించకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. రైల్వే ఆస్తులు రక్షించి, ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ పోలీసులు ఈ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రి దారిలో...

ప్రధాన రోడ్డు నుంచి రైల్వేకాలనీలోని రైల్వే ఆసుపత్రికి వెళ్లే దారికి ఇరువైపులా ప్రహరీకి ఆనుకొని ఉన్న స్థలాలు ఆక్రమించి పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఆసుపత్రి, కాలనీలోకి రాకపోకలు చేపట్టేందుకు రైల్వే ఉద్యోగులు, కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఇళ్లకు నగరపాలక సంస్థ అధికారులు ఇంటి నెంబర్లు మంజూరు చేయడం విశేషం. ఇక్కడి ర.భ.శాఖ రోడ్డు మధ్య నుంచి 50 అడుగుల దూరం వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. రైల్వే ప్రహరీకి అనుకొని వరద నీటి కాలువ నిర్మించాలి. చెట్లు పెంచాలి. ఇందుకోసం సుమారు 10 అడుగుల స్థలం వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు.

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

ఒకప్పుడు రైల్వేస్టేషన్ ఎదుట ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు బస్టాప్, లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్, ఆటో స్టాండ్, ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, జెండా గద్దెలు, పెద్ద పెద్ద చెట్లు, వాటి నీడన నిలబడేందుకు స్థలం, హైమాస్ట్ విద్యుత్తు దీపాలు, చేతి పంపులు, అటవీ, రెవెన్యూ శాఖల కార్యాలయాల స్థలాలు ఇలా ఎన్నో ఉండేవి. కబ్జాలతో అవన్నీ మాయ మయ్యాయి. ప్రస్తుతం అక్కడ రైలు ప్రయాణికులు నిలబడేందుకు, కూర్చునేందుకు స్థలం లేదు. సులభ్ కాంప్లెక్స్ సైతం నిర్మించలేని దుస్థితి.

లోపల విశాలం.. బయట ఇరుకు

రూ.కోట్లు వెచ్చించి స్టేషన్ లోపల రైల్వేశాఖ సౌకర్యాలు కల్పిస్తుండగా స్టేషన్ బయట మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంటోందని ప్రయాణికులు అంటున్నారు. రామగుండంలో రైలు దిగితే స్టేషన్ ఎదుట సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని చెబుతున్నారు. బస్సులు, ఆటోలకోసం వేచి చూడాలన్నా... సొంత వాహనంలో వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదని, స్వాగత తోరణం వద్ద ఇరుకైన రోడ్డు, వాహనాల రద్దీని దాటేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్వాగత తోరణానికి ఇరువైపులా..

రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద స్వాగత తోరణానికి ఇరువైపులా ఉన్న స్థలాలను కొందరు ఆక్రమించారు. ప్రహరీకి అనుకొని అక్రమ కట్టడాలు నిర్మించారు. మొదట్లో ప్రహరీకి ఆనుకొని అయిదు అడుగుల స్థలంలో టీ బండ్లు పెట్టుకోగా తర్వాత చిన్న టేలాలు, ఆతర్వాత రేకుల షెడ్లు, ప్రస్తుతం 20 అడుగుల మేర స్థలంలో గదులు నిర్మించారు. కొందరు ఇనుప జాలీలు, రేకులతో గదులు ఏర్పాటు చేశారు. వీరి దుకాణాల ఎదుట మరో 10 అడుగుల స్థలంలో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంటున్నాయి. ఆయా నిర్మాణాల కారణంగా రైల్వేస్టేషన్ కనిపించకుండా పోయింది.

# బల్దియా బడ్జెట్ రూ.577.52 కోట్లు

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ బడ్జెట్ అంచనాలు కాస్త తగ్గాయి. గతేడాది కంటే ఈసారి పద్దును తగ్గించి ప్రణాళికలు చేశారు. ప్రజలకు అవసరమయ్యే కనీస మౌలిక వసతులతోపాటు అభివృద్ధి పనులు చేసేందుకు ప్రాధాన్యం కల్పించారు. గత నాలుగేళ్లుగా పట్టణ ప్రగతి నిధులు, ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం నుంచి కేటాయించడంతో ఆ అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయి. కేటాయించిన నిధులు విడుదల కాకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉండి అసంపూర్తి పనులు ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి.

రూ.43.92 కోట్లు తగ్గిన అంచనాలు 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.577.52 కోట్లకు అంచనాలు వేయగా గతేడాది ఈ పద్దు రూ.621.44 కోట్లకు చూపించారు. ఈ లెక్కన పరిశీలిస్తే రూ.43.92 కోట్ల ఆదాయం తగ్గింది. మరో వైపు ప్రభుత్వ నిధులపై ఎప్పటిలాగే ఆశలు పెంచుకున్నట్లే పెంచుకొని కుదించారు. పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా ఆదాయం పెరుగుతుందని నిర్ణయించారు. కొత్త దుకాణాలు, అద్దె దుకాణాల గడువు ముగియడంతో వీటిపై ఆదాయాన్ని ఎక్కువ వస్తోందని లెక్కించినట్లు తెలుస్తోంది. విలీన కాలనీల్లో కూడా ఆస్తి పన్ను పెరిగింది. డిపాజిట్లు, అడ్వాన్సులు, రుణాలపై ఎంతమేర పురోగతి వస్తుందో తెలియక అంచనాల్లో కాస్తా తగ్గుదల చూపించారు. ఎప్పటి మాదిరిగానే గ్రీన్ బడ్జెట్‌కు పది శాతం కేటాయించారు. నగర పాలకలో ఖర్చులు కూడా భారీగా పెరుగుతున్నాయి. దాదాపుగా ఆదాయానికి తగ్గట్లు వ్యయం ఉంది.

పాలకవర్గ సభ్యులకు ఎజెండా ప్రతులు

బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని మార్చి 6న ఉదయం 11 గంటలకు నగర పాలక కార్యాలయ సమావేశ మందిరంలో నగర మేయర్ వై.సునీల్‌రావు అధ్యక్షతన నిర్వహించనున్నారు. సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా పాలకవర్గ సభ్యులకు ఎజెండా ప్రతులు పంపిస్తున్నారు.

# అందరి చూపు.. బోర్ల వైపు

గరిడేపల్లి : వ్యవసాయ విద్యుత్తు సర్వీసులకు దరఖాస్తులు రెట్టింపవుతున్నాయి. అదే తరహాలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతూ వస్తుంది. వ్యవసాయానికి 24 గంటలు సరఫరా చేస్తుండటంతో రైతులు బోర్లు, బావుల ఆధారంగా నీటి వనరులను వినియోగించుకుని సాగు చేపడుతున్నారు. గతేడాది ఒక్కసారిగా వ్యవసాయ సర్వీసుల కోసం దరఖాస్తులు భారీగా పెరిగాయి. విద్యుత్తు శాఖ అధికారులు ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోకపోతే ముమ్మందు కరెంటు కష్టాలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పీటీఆర్‌లు లోడు భారం తట్టుకోలేక నిత్యం కాలిపోతున్నాయి.

భారీగా పెరుగుతున్న డిమాండ్

సాగునీటి వనరులు పొందడం కోసం రైతులు పూర్తిగా విద్యుత్‌పైనే ఆధారపడే పరిస్థితి నెలకొంటుంది. సాగర్ జలాశయానికి వరద రాకలో తీవ్ర ఒడుదొడుకులు ఎదురవుతుండటంతో ప్రత్యామ్నాయ నీటి వనరులు వెతుక్కుంటున్నారు. ఏటా జులైలో సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలపై స్పష్టత కొరవడటంతో పాటు ముందస్తుగా నాట్లు వేసుకుంటే తుపానుల నుంచి బయటపడవచ్చని రైతులు భావిస్తున్నారు. సాగునీరు విడుదల లేని సమయంలో బోర్లు, బావుల ఆధారంగా పంటలు సాగు చేసేందుకు రైతులు నాలుగైదేళ్లుగా ఆసక్తి చూపుతున్నారు. వానాకాలంలో వేసిన పంటలను కాపాడుకునేందుకు ఇబ్బడి



ముబ్బడిగా బోర్లు వేసుకున్నారు. వాటికి విద్యుత్ అవసరం కావడంతో రైతులు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. సెప్టెంబరు 2023 నుంచి దరఖాస్తుల పెరుగుదల ఎక్కువైంది.

పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాలి

ఇప్పటికే ఉన్న వ్యవసాయ సర్వీసులకు లోడు పెరగడంతో పీటీఆర్‌లు కాలిపోతున్నాయి. వాటి సామర్థ్యం పెంచితేనే మున్ముందు అధికమవుతున్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు తగిన లోడును తట్టుకునే అవకాశం ఉంది. లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నాయి. వ్యవసాయానికి 24 గంటల సరఫరాపై నిత్యం డిప్యూటీ సీఎం సమీక్షించడంతో పాటు నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పీటీఆర్‌లను 8 ఎంవీఏ నుంచి 12 ఎంవీఏలకు పెంచాల్సిన అవసరం ఉంది.

# ధరణి.. మారనున్న ధోరణి!

ఖమ్మం: భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించటంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ధరణి పోర్టల్‌కు సంబంధించి.. కలెక్టర్ల నుంచి తహసీల్దార్లు, ఆర్డీఓలకు అధికారాలు బదలాయించటంతోపాటు స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించటంతో ఏళ్లుగా పేరుకుపోయిన భూసమస్యలకు త్వరలోనే మోక్షం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కోకొల్లలు పెండింగ్‌లోనే..

భూదస్త్రాల ప్రక్షాళనే లక్ష్యంగా గత ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. ఈపోర్టల్‌లో తలెత్తిన చిక్కుముళ్లతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అనేకమంది రైతులు సతమతమవుతున్నారు. సాంకేతిక కారణాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులతో వేలాది భూసమస్యలకు పరిష్కారం లభించలేదు. ముఖ్యంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, నిషేధిత భూముల జాబితాలో నమోదవటం, వారసత్వ భూములు, మ్యుటేషన్లు, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ తదితర మాడ్యూల్స్ వల్ల కర్షకులకు కష్టాలు ఎదురయ్యాయి. కొందరు రైతుల పాసుపుస్తకాల్లో సర్వే నంబర్లు తప్పుగా నమోదయ్యాయి. భూవిస్తీర్ణంలో తేడాల పరిష్కారానికి టీఎం–33 పేరిట కొత్త మాడ్యూల్‌ను అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. సుమారుగా ఖమ్మం జిల్లాలో 90వేలు, భద్రాద్రి జిల్లాలో 45వేల దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిలో దాదాపు 30వేల దరఖాస్తులకు ఇంకా పరిష్కారం లభించలేదు. బాధిత రైతులకు ప్రభుత్వ ఫలాలు అందని ద్రాక్షగా మారాయి.

చిక్కుముళ్లు వీడేనా..?

2023 ఫిబ్రవరిలో ధరణి పోర్టల్‌తో పాటు అన్నిరకాల భూసమస్యలకు పల్లెల్లోనే పరిష్కారం చూపాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. మండలాల వారీగా ప్రత్యేకాధికారుల బృందాలను నియమించింది. ఇక భూసమస్యలు పరిష్కారమవుతాయని రైతులు హర్షించారు. అధికారుల బృందాలు కొద్దిరోజులు హడావుడి చేసినా అసలు కార్యక్షేత్రంలోకే దిగలేదు. భూసమస్యలు పరిష్కారమవుతాయని భావించిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. నాలుగేళ్లుగా భూసమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్న వారికి న్యాయం చేసేందుకు ప్రస్తుత సర్కారు అడుగేయటం వల్ల అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన భూసమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కూసుమంచి మండలం గట్టుసింగారం రెవెన్యూ పరిధిలో 157 సర్వే నంబర్‌లో 18 గుంటల భూమి కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. ధరణి పోర్టల్ వచ్చాక ఆ భూమి మళ్లీ పాత యాజమాని పేరిట ఉన్నట్లు చూపుతోంది. సంబంధిత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో భూమిని నా పేరిట మార్చాలని దరఖాస్తు చేసుకున్నాను. ఏడాది దాటుతున్నా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. స్థానిక అధికారులను అడిగితే జిల్లాస్థాయిలో పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు.కొంగర నారాయణరావు, నేలకొండపల్లి

2000వ సంవత్సరంలో మడుపల్లి రెవెన్యూ పరిధిలో రెండెకరాల భూమి కొన్నాను. సాదాబైనామా కింద రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాలుగేళ్లు అవుతున్నా పాసుపుస్తకాలు రాలేదు. తహసీల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదు. రైతుబంధు, పంట రుణమాఫీ, బ్యాంకు రుణాలు అందటం లేదు. అన్నిరకాల భూసమస్యలు పరిష్కరించాలని ఇప్పటి ప్రభుత్వం నిర్ణయించటం సంతోషకరం.పంగా శేషగిరి, మడుపల్లి, మధిర మండలం



# మీరొక మంత్రి.. ఆ మాత్రం తెలియదా..?

దిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఇటీవల తీవ్ర దుమారం రేపాయి. దీనికి గానూ పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. ఆ ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలిపి విచారించాలంటూ ఉదయనిధి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆ వ్యాఖ్యలను తప్పుబట్టింది. "వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ కింద ఉన్న మీ హక్కులను దుర్వినియోగం చేశారు. ఇప్పుడు మీరే రక్షణ కోసం సుప్రీంకోర్టుకు వచ్చారు. మీరు చేసిన వ్యాఖ్యలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో తెలియదా? మీరేం సామాన్య పౌరుడు కాదు. ఓ మంత్రి పదవిలో ఉన్నారు" అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 15వ తేదీకి వాయిదా వేసింది. గతేడాది సెప్టెంబరులో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" అంటూ వ్యాఖ్యానించారు.

సనాతన ధర్మం అనేది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది. ఈ క్రమంలోనే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దాన్ని విచారణకు స్వీకరించిన ధర్మాసనం.. ఉదయనిధికి నోటీసులు జారీ చేసింది.

## కేఏ పాల్ పార్టీలో చేరిన బాబూమోహన్.. ఎంపీగా పోటీ



హైదరాబాద్: మాజీ మంత్రి, సినీ నటుడు బాబూమోహన్ ప్రజాశాంతి పార్టీలో చేరారు. ఆయనకు కేఏ పాల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బాబూమోహన్ పోటీ చేస్తారని కేఏ పాల్ ప్రకటించారు. కాగా, ఇటీవల భాజపాకు బాబూమోహన్ రాజీనామా విషయం తెలిసిందే. పార్టీలోని గ్రూపులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ టికెట్‌ను ఆశించానని.. అది ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. జీవితంలో కచ్చితంగా ఒక్కసారైనా అక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుస్తానని గతంలో చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రజాశాంతి పార్టీలో చేరారు.

## కమలం పార్టీలో చిచ్చురేపిన మొదటి లిస్టు...




హైదరాబాద్: కమలం పార్టీలో మొదటి లిస్టు చిచ్చు రేపింది. బీజేపీలో లోక్‌సభ టికెట్ల లొల్లి కొనసాగుతోంది. పలువురు నేతలు గీత దాటుతుండడం చర్చనీయాంశంగా మారింది. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకుంటున్న పార్టీలో ఈ పరిణామాలు ఇబ్బందికరంగా మారాయి. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం మాజీ మంత్రి ఈటల రాజందర్‌కు కేటాయించడంతో సీనియర్ నేత మురళీధరరావు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. స్థానిక నేతలు కూడా ఈటలకు సీటు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్ టికెట్ మాధవి లతకు కేటాయించడాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కిషన్ రెడ్డికి హైదరాబాద్‌లో పోటీ చేసే మగాడే దొరకలేదా? అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక మహబూబ్‌నగర్ టికెట్ విషయంలో ఇద్దరు కీలక నేతల మధ్య ఫైట్ నడుస్తోంది. ఈ టికెట్‌ను మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి ఆశిస్తున్నారు.

పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కూడా పాలమూరు సీటు కోసం పట్టుపడుతున్నారు. మరోవూపు జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని పాటిల్‌కు ఇవ్వడాన్ని స్థానిక నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇక నాగర్ కర్నూల్ టికెట్ దక్కగపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న బంగారు శృతి.. సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

అయితే ఆమె కాంగ్రెస్‌లో చేరుతారని బీజేపీలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

## ప్రధాని మోదీకి కృతజ్ఞతలు..



ఆదిలాబాద్, మార్చి 4: రాష్ట్రాభివృద్ధికి సహకరించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా జిల్లా ఏర్పాటు చేసిన సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. విభజన చట్టం ప్రకారం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఎన్‌టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందుకు.. జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీకి సీఎం రేవంత్, మంత్రి సీతక్క స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. దాదాపు రూ.6వేల కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే ఆరు ప్రాజెక్టులకు వర్చువల్‌గా మోదీ శంకుస్థాపన చేశారు. రామగుండం ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్ ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. అండర్ డ్రైనేజ్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆదిలాబాద్– బేల– మహారాష్ట్ర రోడ్డు విస్తరణ పనులు, రైల్వే విద్యుదీకరణ మార్గానికి ప్రధాని మోదీ ప్రారంభోత్సవం చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



# అసదుద్దీన్‌తో ఢీ..! మాధవీలత ప్రొఫైల్ ఇదే

## హైదరాబాద్ ఎంపీ స్థానంలో అసదుద్దీన్‌పై మాధవీలత పోటీ!.. ఆమె ట్రాక్ రికార్డు ఇదే...

హైదరాబాద్ : నగరంలో పూర్వ వైభవం కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. పాతబస్తీలో పార్టీని పటిష్టం చేయాలనే ధ్యేయంతో అడుగులు వేస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంలో మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు విరించి ఆస్పత్రి, లతామా ఫౌండేషన్‌ల చైర్‌పర్సన్ మాధవీలతకు టికెట్ ఖరారు చేసింది. మజ్లిస్‌కు దీటుగా ఉండేందుకే మాధవీలతకు టికెట్ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయాలకు మాధవీలత కొత్త. ఆమెకు పార్టీలో గాడ్‌ఫాదర్ ఎవరూ లేరనే చెప్పొచ్చు. ఎంఐఎం కంచుకోటను బద్దలు కొడతానని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. తొలుత హైదరాబాద్ స్థానంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బరిలో నిలపాలని భావించినా ఆయన నిరాకరించారని సమాచారం. ఎన్‌సీసీ క్యాడెట్‌గా, క్లాసికల్ సింగర్‌గా మాధవీలత గుర్తింపు తెచ్చుకున్నారు. బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాధవీలత రెండేళ్లుగా పాతబస్తీ వేదికగా అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారు. గోశాలతో పాటు భారీ యజ్ఞశాల ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాలు, పాలనా స్ఫూర్తితో బీజేపీలో చేరారు. కొంతకాలంగా పాతబస్తీ ప్రజలతో మమేకమై పేదలను ఆదుకుంటున్నారు. సామాజిక కార్యకర్తగా ట్రిపుల్ తలాక్‌పై అనేక ముస్లిం మహిళా సంఘాలతో కలిసి పనిచేశారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కౌంటర్‌గా ఇచ్చిన పలు ఇంటర్వ్యూలతో ఆమె పాపులర్ అయ్యారు. బీజేపీ ప్రతినిధిగా అసదుద్దీన్ విధానాలను తనదైన శైలిలో వ్యతిరేకించడంతో పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడ్డారు. మాధవీలత ఎంపికపై పునరాలోచించాలని హైదరాబాద్ స్థానం కోసం ప్రయత్నాలు చేసిన బీజేపీ భాగ్యనగర్ జిల్లా నాయకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

**25 ఏళ్లు సంతోష్‌నగర్‌లోనే..** మాధవీలత పాతబస్తీలోని ఓల్డ్ సంతోష్‌నగర్‌లో జన్మించారు. విద్యాదాయిని పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించారు. నిజాం కాలేజీలో డిగ్రీ, కోఠి ఉమెన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. ఆమె పుట్టి పెరిగిందంతా ఓల్డ్ సంతోష్‌నగర్‌లోనే. 25 సంవత్సరాల పాటు అక్కడే ఉన్నారు. వివాహం అనంతరం భర్త కె.విశ్వనాథ్ (విరించి గ్రూప్ ఫౌండర్)తో కలిసి జూబ్లీహిల్స్‌కు వెళ్లిపోయారు. వీరికి ముగ్గురు పిల్లలు. ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్ గా, లతా ఫౌండేషన్ నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నారు.

**1962లో జనసంఘ్ పోటీ :** 1962 ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంలో జనసంఘ్ పోటీ చేసింది. ఆ తర్వాత జనసంఘ్ జనతాపార్టీలో విలీనమైంది. 1980లో బీజేపీ తరఫున ఆలె నరేంద్ర రంగంలోకి దిగారు. ఆయనకు 1,35,304 ఓట్లు వచ్చాయి. 1984, 1989లో బీజేపీ తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చింది. 1991లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసిన బీజేపీ 42.2 శాతం, 1996లో జరిగిన ఎన్నికల్లో 26.68 శాతం ఓట్లు సాధించింది.

**1991 నుంచి బరిలో బాల్‌రెడ్డి :** 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున దివంగత నాయకుడు బద్దం బాల్‌రెడ్డి పోటీ చేసి 4,15,299 ఓట్లు సాధించారు. 1996లో జరిగిన ఎన్నికల్లో ఆయనకు 2,47,772 (26.13) ఓట్లు, 1998లో 4,14,173 (38.07) ఓట్లు వచ్చాయి. 1999లో జరిగిన ఎన్నికల్లో మరోసారి బద్దం బాల్‌రెడ్డి పోటీ చేయగా 3,87,344 ఓట్లు వచ్చాయి. 2004 ఎన్నికల్లో పోటీచేసిన సుబాషచందర్‌జీ 2 లక్షల 78 వేల ఓట్లు సాధించారు. 2009లో సతీష్ అగర్వాల్ పోటీ చేసినా పెద్దగా ఓట్లు రాలేదు. 2009లో స్థానికంగా పట్టున్న భగవంతరావును బరిలోకి దింపగా గట్టి పోటీ ఇచ్చి దాదాపు 3.11,414 ఓట్లు సాధించారు. పాతబస్తీలో పార్టీకి పట్టుందని నిరూపించారు.

**1984 నుంచి ఓవైసీల అడ్డా :** హైదరాబాద్ స్థానం ఎంఐఎం అడ్డాగా పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ 2004 నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు. అంతకుముందు ఆయన తండ్రి సలావుద్దీన్ ఓవైసీ ఎంపీగా ఉన్నారు. మొత్తంగా 1984 నుంచి 2024 వరకు నాలుగు దశాబ్దాల పాటు ఎంఐఎం పార్టీదే ఆధిపత్యం. ఈ సారి ఎలాగైనా ఎంఐఎంకు చెక్ పెట్టి విజయం సాధించాలని భావిస్తున్న బీజేపీ అధిష్ఠానం అనూహ్యంగా మాధవీలతకు ఛాన్స్ ఇచ్చింది.

**అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎంకు గట్టి పోటీ ఇచ్చిన ఎంబీటీ :** పాతబస్తీలో తమకు ఎదురే లేదని భావిస్తున్న ఎంఐఎంకు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలో యాకుత్‌పురాలో ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ గట్టి పోటీ ఇచ్చారు. నాంపల్లిలో సైతం కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ గట్టిగా నిలబడ్డారు. హైదరాబాద్ స్థానంలో అనేక సార్లు లోక్‌సభకు పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి బద్దం బాల్ రెడ్డి ఎంఐఎంకు గట్టిగా పోటీ ఇచ్చారు. నాటి నుంచి ఈ స్థానంలో ఎంఐఎం పట్టు నిలుపుకుంటూ వచ్చినా 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి నేటి వరకు బీఆర్ఎస్ సాయంతో గెలుస్తూ వస్తోంది.

**బీజేపీ జెండా ఎగరేస్తా : మాధవీలత** – సిట్టింగ్ ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీని ఓడించి తీరుతా. హైదరాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం. ఇక్కడ విజయం సాధించి అయోధ్య బాలరాముడి పాదాలకు, ప్రధాని నరేంద్ర మోదీకి అంకితం ఇస్తా

## భానుడి భగ.. భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి..



హైదరాబాద్ : భానుడి భగ.. భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చి మొదటి వారంలోనే పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సరూర్‌నగర్, కార్వాన్‌లో అత్యధికంగా 38.8 డిగ్రీలు నమోదయ్యాయి. వారం రోజుల క్రితం గ్రేటర్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 3,300 మెగావాట్లకు పెరిగింది.

పగటి ఉష్ణోగ్రలతోపాటు రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీల వరకు నమోదవుతున్నది. మరో రెండురోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఉపరితల గాలులు దక్షిణ/నైరుతి దిశలో గంటకు 4–8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. చార్మినార్ 38.4, బేగంపేట 38.7, సంతోష్ నగర్ 38.5, గోషామహల్ 38.3, ఉప్పల్ 38.3, కాప్రా 38.3, హయత్‌నగర్ 38.0, ఎల్‌బీనగర్ 37.9, మూసాపేట 37.7, రాజేంద్రనగర్ 37.6, కుత్బుల్లాపూర్ 37.6.

## నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌పై మల్లు రవి క్లారిటీ



హైదరాబాద్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీపై మాజీ ఎంపీ మల్లు రవి స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ నుంచి పోటీలో మల్లు రవి ఉంటారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. "టికెట్ నాకే ఇస్తానని సీఎం స్పష్టంగా చెప్పారు. నాగర్ కర్నూల్ టికెట్ నాకే ఇస్తారని నమ్మకంగా ఉన్నాను. సర్వేలన్నింటిలో నేనే ముందున్నాను" అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ – బీఎస్పీ మధ్య చర్చలు జరుగుతున్నాయన్నారు. హిందూ మత మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ పని చేస్తోందని విమర్శించారు. బీజేపీ హిందూ మతానికి వ్యతిరేకంగా పని చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ అవగాహనతో పని చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో లాగా తమ ప్రభుత్వంలో పాలాభిషేకాలు లేవన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోతామనే పారిపోతున్నారని మల్లు రవిం ఎద్దేవా చేశారు.

## ముగ్గురు పిల్లలను చంపి చెట్టుకు ఉరి వేసుకున్న తండ్రి



రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం టంగుటూరు గ్రామంలో అప్పుల బాధతో రవి (35)అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా స్వగ్రామంతో పాటు ఇతర గ్రామాల ప్రజల వద్ద నుంచి మనీ స్కాం నిర్వహిస్తూ వెయ్యికి 3000.. లక్షకు 58 రోజులకు 5 లక్షలు ఇప్పిస్తానంటూ డబ్బులు కట్టించాడు. తీరా చూస్తే డబ్బులు రాలేదు. దీంతో డబ్బు కట్టిన ప్రజలు ఇంటికి రావడంతో ఏం చేయాలో తోచక ఇంట్లో పిల్లలను చంపి రవి కూడా పంట పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## ఘోర కారు ప్రమాదం.. ఐదుగురు మృతి




వనపర్తి: కొత్తకోట మండలం 44 జాతీయ రహదారి పై మారుతి ఎర్టిగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బళ్లారి నుంచి హైదరాబాద్ వెళ్తున్న మారుతి ఎర్టిగా కారు టెక్కెలయ్య దర్గా సమీపంలో రాత్రి రెండు గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. కారులో మొత్తం 11 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో చిన్నారి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఇక గాయాలపాలైన నలుగురిలోనూ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**చనిపోయిన వారి వివరాలు** 1)వాసి (2), 2) అబ్దుల్ రెహమాన్ (35), 3) ఫాతిమాబి (50 ), 4) బుశ్రా (1), 5) మరియం బి (3 ).

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660